క్లుప్తంగా

రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటండి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

కర్నూలు (టౌన్) : ఈనెల 15,16 తేదీల్లో బాపట్లలో జరిగే సీనియర్ రగ్బీ అంతర్ జిల్లాల పోటీల్లో రాణించాలని ఆంధ్రప్రదేశ్ రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి రగ్బీ ఎంపిక పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకొని మాట్లాడారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ ప్రతినిధులు మహబూబ్, సుభానీ, కిరణ్, రాఘవేంద్ర, శ్రీను, వెంకటేశ్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్) : సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చంద్రబాబునాయుడు చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు కోరారు. మంగళవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. సీఎంగా ప్రమాణస్వీకారం తర్వాత చంద్రబాబు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ తేవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అనంతరత్నం, సయ్యద్‌నవీద్, లాజరస్ పాల్గొన్నారు.

25 వేలపోస్టులతో డీఎస్సీ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వై.నగేష్

కర్నూలు(సెంట్రల్) : ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీని 25 వేల పోస్టులతో విడుదల చేయాలని, దానిపైన చంద్రబాబు నాయుడు తొలి సంతకం పెట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాలను కూటమి ప్రభుత్వం కల్పించాలన్నారు. అయితే ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగులకు నెలకు 3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, కడప ఉక్కు కర్మాగారం, కర్నూలు రైల్వే వ్యాగన్ నిర్మాణాలను చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా, నగర కార్యదర్శి హుస్సేన్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



విద్యార్థిని వై.ఉషను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుంకన్న, అధ్యాపకులు

కర్నూలు(సెంట్రల్) : వరంగల్ ఎన్ఐటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో సీటు సాధించిన తమ కళాశాల విద్యార్థి వై.ఉషను ప్రభుత్వ టౌన్ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న అభినందించారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఎంపీసీలో ఇంటర్ చదివిన వై.ఉష జేఈఈ మెయిన్స్‌లో 89 శాతం మార్కులతో వరంగల్ ఎన్ఐటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ సీటును సాధించింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆమెను ప్రిన్సిపాల్ కళాశాలకు పిలిపించి అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదవాలని ఆశీర్వదించారు.

యోగాతో ఆరోగ్యం



వేసవి శిబిరంలో యోగాసనాలు చేస్తున్న చిన్నారులు

కర్నూలు (టౌన్): క్రమం తప్పకుండా యోగ చేస్తే ఆరోగ్యంతో పాటు ఆనందం కలుగుతుందని జాతీయ యోగ సంఘం కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నగరపాలక సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న వేసవి యోగ శిక్షణ శిబిరం ముగిసింది. అంతకు ముందు వారు మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు యోగ సాధన ద్వారా ఒత్తిడిని అధిగమించి చదువులో రాణిస్తారన్నారు. తర్వాత చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, యోగ శిక్షకులు మునిస్వామి పాల్గొన్నారు.

అతివేగానికి బ్రేక్

- ప్రభుత్వాసుపత్రి వద్ద కొత్తగా నాలుగు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

ప్రభుత్వాసుపత్రి నుంచి మెడికల్ కాలేజీ హాస్టల్‌కు వెళ్లే దారిలో ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆసుపత్రికి రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. మందులు, వివిధ అవసరాల కోసం రోడ్డు దాటుతుంటారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల మెడికల్ కాలేజీ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వైద్య విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకుని వాహనాల అతి వేగానికి కళ్లెం వేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు మంగళవారం ప్రభుత్వాసుపత్రి వద్ద, మెడికల్ కాలేజీ వద్ద, మెడికల్ కాలేజీ హాస్టల్ వద్ద రోడ్డుపై మొత్తం నాలుగు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు.

–కర్నూలు (న్యూటౌన్)



కర్నూలు మెడికల్ కాలేజీ ఎదురుగా స్పీడ్ బ్రేకర్లు వేస్తున్న దృశ్యం



స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుతో నిదానంగా వెళ్తున్న వాహనాలు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మాస్ మీడియా అధికారి ప్రమీలాదేవి చెప్పారు. మంగళవారం స్థానిక కల్లూరు ఎస్టేట్‌లోని ముజఫర్‌నగర్‌లో యూపీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమీలాదేవి మాట్లాడుతూ ఆశా డేకు సంబంధించిన అజెండా గురించి వివరించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డయేరియా గురించి అవగాహన కల్పించారు. 18 నుంచి 22 వారాల హైరిస్క్ గర్భిణులకు టిఫా స్కాన్ కోసం ఆరోగ్యశ్రీ ఎస్ ప్యానెట్ ఆసుపత్రులకు వైద్యాధికారి సూచనలతో రెఫర్ చేయాలని చెప్పారు. తీవ్ర రక్తహీనత గల గర్భిణులను ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తమార్పిడి చేసేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఉచిత రవాణా సౌకర్యం గురించి అవగాహన కల్పించాలన్నారు. ఆశా యాప్‌లో అర్హులైన దంపతుల సేవలు, ఐరన్ మాత్రల పంపిణీ, విటమిన్–ఎ ద్రావణం పంపిణీ, నవజాత శిశుసేవల వివరాలను క్రమం తప్పకుండా అప్‌లోడ్ చేయాలన్నారు. గర్భిణులకు 4వ నెల నుంచి ప్రసవానంతరం బిడ్డకు ఒక సంవత్సరం వచ్చే వరకు మాతాశిశు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కోసం కిల్కారి మెసేజ్‌ల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. లింగ వివక్షత నిర్మూలన, గర్భస్థ లింగనిర్ధారణ వ్యతిరేక చట్టం, ఆడపిల్లల ప్రాముఖ్యత, తాత్కాలిక గర్భనిరోధక పద్ధతుల గురించి ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుప్రియ, డాక్టర్ ఫర్వీన్ తబసం, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఈఈఓ శ్రీనివాసులు, పీసీ పీఎన్‌డీటీ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా మాస్ మీడియా అధికారిణి ప్రమీలాదేవి

ప్రజలకు వైద్యసేవలు మెరుగుపరచాలి



ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు వైద్యసేవలు మెరుగుపరచాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డికి సీపీఎం నాయకులు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, కార్యదర్శివర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ క్యాజువాలిటీలో పడకల సంఖ్య పెంచాలని, అదనపు గదులను కేటాయించాలని కోరారు. క్యాజువాలిటీవద్ద స్ట్రెచ్చర్ల సంఖ్యను పెంచాలని, ప్రతి బ్లాక్‌లో పాడైపోయిన మరుగుదొడ్లను మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రిలో వార్డు బాయ్‌ల సంఖ్యను పెంచాలని కోరారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీగార్డులు, స్వీపర్లకు ఒప్పందం ప్రకారం జీతాలు ఇవ్వాలని, వారికి పీఎఫ్, ఈఎస్ఐ నిధులను కార్మికుల ఖాతాలో జమచేయాలని, ఈ మేరకు కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఎం కార్యదర్శి వర్గసభ్యులు కేపీ నారాయణ, కార్యదర్శి ఎం. రాజశేఖర్ ఉన్నారు.

నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

- డీఆర్వోకు విన్నవించిన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)నిర్వహించి వెల్లడించిన నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ అంశంపై ఏఐవైఎఫ్ శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ షబీర్ బాష ఆధ్వర్యంలో నాయకులు డీఆర్వో కె. మధుసూదన్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం, అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కు సంబంధించిన వారు కావడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. మరోవైపు జూన్ 4వ తేదీన రావాల్సిన నీట్ ఫలితాలు పది రోజుల తరువాత జూన్ 14వ తేదీన విడుదల కావడంలోనూ ఏదో అంతర్యం ఉందన్నారు. గుజరాత్‌కు చెందిన కొందరు వ్యక్తులు పేపర్లను లీక్ చేశారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. వీటన్నింటిపై తక్షణమే ఎన్‌టీఏ స్పందించి సమగ్ర విచారణ జరపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శరత్‌కుమార్, అభి, కల్యాణ్, అఖిల్, హరీష్, సాయి పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వల!

- బ్యాంకుల ప్రతినిధుల పేరిట వాట్సాప్ మెసేజ్‌లు
- డబ్బు గెలుచుకున్నారని ఫోన్ చేసి ఆశ చూపుతున్న కేటుగాళ్లు
- యువకులకు న్యూడ్ వీడియో కాల్స్



పత్తికొండ రూరల్ : నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరికి సెల్‌ఫోన్ తప్పనిసరి అయ్యింది. ఇంకోవిధంగా చెప్పాలంటే జీవితంలో భాగమైంది. ఈ అవకాశాన్ని సైబర్ నేరగాళ్లు వాడుకుంటున్నారు. గత కొన్నిరోజుల నుంచి సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతూ ఏదో ఒక రూపేణా డబ్బు ఆశ చూపించి ప్రజలకు ఆశల వల విసురుతున్నారు. సైబర్ కేటుగాళ్ల మాయమాటలకు అమాయకులేకాదు... మేధావులు సైతం మోసపోతూనే ఉన్నారు. 'మీరు నెట్ బ్యాంకింగ్ ద్వారా రూ.9,980లు రివార్డు గెలుచుకున్నారు. ఎస్‌బీఐ రివార్డు యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి... వెంటనే మీకు అకౌంటుకు రివార్డు సొమ్ము జమ చేయబడుతుందని ఒక మెసేజ్'.. ఇలా పలు వాట్సాప్ గ్రూపుల్లో సైబర్ నేరగాళ్లు ఖాతాదారుల అకౌంటు నుంచి సొమ్మును కాజేసేందుకు వల విసురుతున్నారు. మరికొందరికి ఏకంగా ఫోన్ చేసి ఆధార్‌కార్డు నెంబరు, డెబిట్ కార్డు వివరాలు, పిన్ నెంబరు లాంటి వివరాలు అడుతూ మాయమాటలు చెప్పి ఖాతాలు ఖాళీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏ మెసేజ్ వెనుక ఎలాంటి మోసం దాగుందో తెలియక సెల్‌ఫోన్ వినియోగదారులు పరేషాన్ అవుతున్నారు. గత నెలలో కూడా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని మండలంలోని కొందరు అమాయక యువకుల అకౌంటులో సొమ్ము రూ. లక్షల్లో మాయమైంది. కొందరు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయిస్తుండగా మరి కొందరు తాము మోసపోయిన ఈవిషయం బయటకు తెలిస్తే నలుగురిలో నవ్వులపాలవుతామని గమ్మున ఉంటున్నారు. కొందరు యువతులు యువకులకు న్యూడ్ వీడియో కాల్స్ చేసి వలపు వల విసురుతున్నారు. మాయమాటలతో మభ్యపెడుతున్నారు. ఆ తర్వాత వారితో మాట్లాడిన శృంగార సంభాషణ, వీడియో ద్వారా చిత్రీకరించి వారికే వాట్సాప్ ద్వారా పంపించి బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారు. ఈవీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసి మిమ్మల్ని బజారుకి లాగుతామని బెదిరించి డబ్బు లాగుతున్నారు. ఇలా సైబర్ నేరగాళ్ల ఆగడాలు రోజురోజుకూ శృతిమించిపోతున్నాయి. సైబర్ నేరగాళ్ల నియంత్రణకు పోలీసు అధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డబ్బులెవరికీ ఊరికే రావు

ముఖ్యంగా డబ్బులెవరికీ ఊరికే రావు అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటే అంతే సంగతులు. ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయి. వాట్సాప్ ద్వారా వచ్చిన వివిధ బ్యాంకుల పేరుతో తప్పుడు సందేశాలను నమ్మవద్దు. ఏబ్యాంకు నుంచి ఎవరూ ఫోన్ చేసి ఏటీఎం కార్డు పిన్ నెంబరు చెప్పమని అడగరు. ఫేక్ యాప్‌లను ఎవరూ డౌన్‌లోడు చేసుకోవద్దు. ఈవిషయాన్ని అందరూ గమనించాలి. డబ్బు ఆశ చూపించే వారి మాయమాటలు నమ్మకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– మురళీమోహన్, సీఐ, పత్తికొండ

మలేరియా కేసు నమోదు

దేవనకొండ: మండలంలోని నెల్లిబండ గ్రామంలో మలేరియా కేసును గుర్తించినట్లు జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు గ్రామంలోని రంగస్వామి అనే వ్యక్తికి మలేరియాతో బాధపడుతున్నట్లు గుర్తించి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. బాధితుడి ఇంటి పరిసరాలను మంగళవారం పరిశీలించి డీడీటీ మందును పిచికారీ చేయించారు. వర్షాలు కురుస్తున్నందువల్ల సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పంచాయతీ సిబ్బంది చేత స్ప్రే చేయిస్తామన్నారు. అనంతరం మలేరియా, చికున్‌గున్యా, బోధకాలు, మెదడువాపు వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

మహానందిలో భక్తజన సందడి

మహానంది: మహానందిలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మంగళవారం రెండు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేలాది మంది భక్తులరాకతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈఓలు వై.మధు, ఓంకారం వేంకటేశ్వరుడు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు అంబటి శశిధర్‌రెడ్డి, నీలకంఠరాజులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

మహానంది: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో అమరావతికి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లనున్న నేపథ్యంలో మహానంది మండలంలోని గాజులపల్లె సమీపంలో ఉన్న ఆంజనేయపురం వద్ద పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులోని ఈ చెక్‌పోస్టు వద్ద నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి, తాలూకా సీఐ దస్తగిరి బాబు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి అనుమతి ఉన్నవారిని మాత్రమే పంపించాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం.

బాలలను పనిలో పెట్టుకుంటే నేరం



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : సమాజంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దిశ సీఐ అబ్దుల్ గౌస్ కోరారు. మంగళవారం సంఘం కార్యాలయంలో ఏపీ ప్రొ చైల్డ్ గ్రూపు నెట్‌వర్క్ కమిటీ, క్రాపీ సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బాలలను ఎవరూ పనిలో పెట్టుకోకూడదన్నారు. వారిని పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ ప్రొ చైల్డ్ గ్రూపు నెట్‌వర్క్ కమిటీ కన్వీనర్ బత్తుల చెన్నయ్య, కర్నూలు జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరం అధ్యక్షుడు కె.విజయరాజు, మాజీ సీడబ్ల్యూసీ సభ్యుడు మద్దిలేటి పాల్గొన్నారు.

రహదారి మధ్యలో విగ్రహం ఏర్పాటు

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక నంద్యాల చెక్‌పోస్టు నుంచి నందికొట్కూరు వైపు వెళ్లే రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. అలాంటి ఈ మార్గంలో రెండు రోజుల క్రితం సరిగ్గా వినాయక దేవాలయం ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తులు దేవుళ్ల విగ్రహం పెట్టారు. రోడ్డు మధ్యలో రాళ్లు ఏర్పాటు చేసి పెట్టడంతో రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్నాయి. రాయి తగిలి ద్విచక్ర వాహనాదారులు రక్తగాయాలతో ఆసుపత్రికి వెళ్లారు. రోడ్డు సైడు బంకులు వేస్తే రాకపోకలకు ఇబ్బంది అవుతుందని హడావుడిగా తొలగించే నగరపాలక సిబ్బందికి రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన విగ్రహం కనిపించలేదా అని స్థానికులు, వాహనదారులు మండిపడుతున్నారు.



నడిరోడ్డులో ఏర్పాటు చేసిన విగ్రహం

భగవద్గీతతో మానసిక ప్రశాంతత

ఓర్వకల్లు: మానసిక ఒత్తిడిని అధిగమించి ప్రశాంత జీవనం గడపడానికి భగవద్గీతను చదవడం అలవాటు చేసుకోవాలని మిడుతూరుకు చెందిన ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు రామచంద్రుడు అన్నారు. మండలంలోని హెచ్ కొట్టాల, చెన్నశెట్టిపల్లె గ్రామాల్లో మంగళవారం ప్రబోధ సేవా సమితి సభ్యులు త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. సమితి సభ్యులు శ్రీనివాసులు, రాఘవేంద్ర, రవి, గోకారి, జగదీష్, సుజాత, హైమావతి, సుబ్బలక్ష్మి, రమణమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న సమితి సభ్యులు

దరఖాస్తు చేసుకోండి

ఆస్పరి: మండలంలోని పుటకలమర్రి గ్రామం వద్ద ఉన్న మోడల్ స్కూల్లో 2024–24 సంవత్సరానికి 7, 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థులు ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ షామీల తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ 7వ తరగతిలో ఏడు సీట్లు ఖాళీ ఉండగా రిజర్వేషన్ పరంగా ఈడబ్ల్యూఎస్ బాలికలకు– 3 సీట్లు, ఎస్సీ జనరల్–1, ఎస్టీ బాలికలకు –1, బీసీ– ఈ బాలికలకు –1, పీహెచ్ బాలికలకు –1, అలాగే 8వ తరగతిలో 6 సీట్లు ఖాళీ ఉండగా రిజర్వేషన్ పరంగా ఓసీ జనరల్–1, బీసీ–డి జనరల్ –1, బీసీ–ఈ జనరల్ –1, ఎస్సీ బాలికలకు –1, ఎస్టీ జనరల్ –1, పీహెచ్ జనరల్ –1 ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 18వ తేదీన మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి రిజర్వేషన్ పరంగా సీట్లు భర్తీ చేస్తామని చెప్పారు. అలాగే 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఎంపికైన వారు 15వ తేదీలోగా చేరాలని సూచించారు.

మున్సిపల్ కార్మికులకు పని ముట్లు అందజేయాలి

కర్నూలు (టౌన్): మున్సిపల్ కార్మికులకు సకాలంలో పని ముట్లు అందజేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌ను ఆ సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఎన్నికల భత్యం, సమ్మెకాలపు వేతనాలు తక్షణమే మంజూరు చేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు యూనిఫామ్, ఏపీజీఎల్ఐ బాండ్లు, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఆదివారం సెలవును మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులగం మద్దిలేటి, కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.



అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప

17 నుంచి ఒలింపిక్ డే సంబరాలు

కర్నూలు (టౌన్): ఈనెల 17 నుంచి జిల్లాలో ఒలింపిక్ డే సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆ క్రీడా సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఒలింపిక్ సంఘం ప్రతినిధులు, క్రీడా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23 వ తేదీన ఒలింపిక్ డే వేడుకలను పురస్కరించుకొని జిల్లాలో 17 వ తేదీ నుంచి వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, రగ్బీ, అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, తైక్వాండో, కరాటే, సైకిల్ పోలో, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, నెట్‌బాల్ క్రీడా సంఘాల ప్రతినిధులు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు

నర్సుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే నర్సుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌లకు ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షురాలు డి. మంజులాదేవి మంగళవారం విజయవాడలో వినతి పత్రం సమర్పించారు. ఆసుపత్రుల్లోని నర్సులు స్థానికంగా చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారికి రావాల్సిన జీతభత్యాల విషయంలోనూ న్యాయం చేయాలని కోరారు.

ఏపీఈఏపీ సెట్‌లో సత్తాచాటిన విద్యార్థులు



చైతన్య విద్యార్థులను అభినందిస్తున్న డీన్‌లు సరళ, బాలాజీ



నారాయణ విద్యార్థులతో డీజీఎం గోవర్ధన్‌రెడ్డి, డీన్‌లు ఆంజనేయరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్) : ఏపీఈఏపీ సెట్‌లో కార్పొరేట్ కాలేజీ విద్యార్థులు సత్తాచాటారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో పలువురు ఉత్తమ ర్యాంకులు సాధించారు.

➡ ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులదే అగ్రస్థానమని ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. ఏపీఈఏపీ సెట్‌లో ఇంజినీరింగ్ విభాగంలో పి.ప్రణీత్‌రెడ్డి 188వ ర్యాంకుతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో తమ విద్యార్థి పి.ఇమామ్ కాశింబీ 753వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. అలాగే ఈఏపీ సెట్‌లో 2 వేలలోపు 4 ర్యాంకులు, 5 వేల లోపు 17 ర్యాంకులు, 10 వేల లోపు 64 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించినట్లు చెప్పారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను డీన్‌లు సరళ, బాలాజీ అభినందించారు.

➡ ఈఏపీ సెట్‌లో నారాయణ విద్యార్థుల హవా కొనసాగిందని డీజీఎం టి.గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ఫణిధర్‌రెడ్డికి 69వ ర్యాంకు, పి.మహ్మద్ ఇర్ఫాన్‌కు 82వ ర్యాంకు, ఎండీ సైఫ్ రోషన్‌కు 228 ర్యాంకు, సానియా అబ్రకు 238వ ర్యాంకు, మధుహకు 243, అమాన్ రయాద్ 249 కె.తన్మయికు 300, డి.హరిణికి 329, జి.వైష్ణవికి 352, భావికారెడ్డికి 410, జె.మృదులకు 412, టి.టీనారెడ్డికి 434, ఆర్ ఆదిత్యవర్ధన్‌రెడ్డికి 496 వచ్చినట్లు చెప్పారు. అలాగే ఇంజినీరింగ్ విభాగంలో ఎస్ .సాకేత్ రామ్‌కు 297, వేదవ్యాస్‌కు 524, సాకేత్ సాయి మణికంఠకు 721, లాస్యకు 748, బి.నవీత్ 817, ఎం.రాజశేఖర్‌కు 913వ ర్యాంకులు వచ్చినట్లు వివరించారు. ఇంజినీరింగ్‌లో 500లోపు ఒక్కటి, 1000 లోపు 6, 2 వేలలోపు15, 3 వేల లోపు 33, 5 వేలలోపు 46 మందికి ర్యాంకులు వచ్చినట్లు తెలిపారు. కాగా, ర్యాంకులను సాధించిన విద్యార్థులను డీజీఎం గోవర్ధన్‌రెడ్డితో పాటు డీన్‌లు ఆంజనేయరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు వేణుగోపాల్‌రెడ్డి, విజయమోహన్ అభినందించారు.